andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 । కనిష్ఠం 24.7

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

3

బుధవారం 18 సెప్టెంబరు 2024



వెళ్లిరా.. గణేషా..!

▸▸ గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ▸▸ శోభాయాత్రను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ ▸▸ భారీ బందోబస్తు మధ్య కొనసాగిన వినాయక ప్రతిమల ఊరేగింపు ▸▸ జిల్లాకేంద్రంలో జనసంద్రంగా మారిన ప్రధాన వీధులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలతో ఐక్యమత్యం మరింత పెరుగుతుందని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు అన్నారు. నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం నిర్వహించే గణేష్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు. మంగళవారం స్థానిక వినాయక చౌక్‌లోని సరసతీ శిశుమందిర్‌లో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బోథ్ నియోజక వర్గంలోని ఇచ్చోడ, బోథ్ మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వినాయకులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ముందుగా నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతీ మాత, గణనాథుడికి పూలమాలలు వేసి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మాండ్లు, సభ్యులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేసిన భరతనాట్యం, కళానృత్యాలు, కోలాటం పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. శోభాయాత్రగా వినాయక విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ హిందూ సమాజ్ ఉత్సవ సమితి నిర్వహిస్తున్న శోభాయాత్ర ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఉత్సవ సమితి సభ్యులు నవరాత్రులలో చేస్తున్నటువంటి కృషి అభినందనీయమన్నారు. తొమ్మిది రోజుల పాటు దైవచింతన ఎన్నో సత్ఫలితాలనిస్తుందన్నారు. ప్రతియేటా గణేష్ ఉత్సవాలను విజయవంతం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లను నిర్వహిస్తూ పర్యవేక్షిస్తున్నామన్నారు. భక్తిమార్గంతోనే జిల్లాలో శాంతియుత వాతావరణం కనిపిస్తుందన్నారు. గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులు అంతే భక్తిశ్రద్ధలతో శోభాయాత్రను ప్రశాంతంగా కొనసాగించాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరుగకుండా ప్రతీఒక్కరు బాధ్యతాయుతంగా ముందుకు నడువాలన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ గణేష్ నవరాత్రులకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. విఘ్నేశ్వరున్ని పూజించడం ద్వారా తమలోని విఘ్నయాలు తొలగి పోతాయని సూచించారు. నేటి సమాజంలో ఆధ్యాత్మికతతో ప్రతీ యువతీ, యువకుడు ప్రశాంతతను సాధించవచ్చన్నారు. ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ జిల్లాలో గణేష్ నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో బందో బస్తును ఏర్పాటు చేసిందన్నారు. ఎటువంటి సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహారాష్ట్రలోని ముంబై తర్వాత వినాయక ఉత్సవాలను తెలంగాణ రాష్ట్రంలోనే ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. అందులోనూ వినాయక మండపాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంలో ఆదిలాబాద్ జిల్లా రెండవ స్థానంలో నిలుస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా వాడ వాడలా లంబోధరుడి పూజలతో పుర వీధులన్నీ భక్తుల భక్తి పారవశ్యంతో భజన కీర్తనలతో, వివిధ పూజాది కార్యక్రమాలతో సందడిగా మారాయి.

పెన్‌గంగా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేసేందుకు పెన్‌గంగా నది, చాందా(టి) వాగు వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రత కల్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిబ్బందితో పర్యవేక్షణ చేశారు. 11 రోజుల పాటు పూజలందు కున్న లంబోదరుడి నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వినాయక ప్రతిమలను తరలించే వాహనాలను ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. నిమజ్జనానికి కావాల్సిన క్రేన్లు, మున్సిపల్ సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచారు. ప్రధాన వీధుల గుండా గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమానికి పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారుగా 700 మంది పోలీసులు గణేష్ నిమజ్జన బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. పెన్‌గంగా నదిలో వరద నీటి ప్రవాహం ఉండడంతో అటువైపు ఎవరిని వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లాకేంద్రంలో పలు మార్గాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వినాయక ప్రతిమలు ఊరేగింపుగా వెళ్లే మార్గాలలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

బ్యాండ్ మేళాలతో ఊరేగింపు

డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్స్, బ్యాండ్ మేళాలతో గణనాథులను పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. మంగళవారం సాయంత్రం వినాయక విగ్రహాల ఊరేగింపును ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడు మొదటి పూజలు అందుకుని నిమజ్జన శోభాయాత్రలో సైతం ముందు వరుసలో నిలిచింది. ఈ నిమజ్జన వేడుకకు జిల్లా అధికార యంత్రాంగంతో పాటు జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ప్రతీ వినాయక శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించారు. ఈ శోబాయాత్ర అశోక్‌రోడ్డు మీదుగా అంబేద్కర్‌చౌక్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే హారతి పూజా కార్యక్రమంతో ముగుస్తుంది. అనంతరం పెన్‌గంగా, చాందా వాగులో భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే డీజేలు, బ్యాండ్ మేళాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థానికంగా దొరకడం కష్టంగా మారడంతో పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి బ్యాండ్ మేళాలను, డీజేలను అద్దెకు తీసుకున్నారు.

భారీగా తరలివచ్చిన జనం

ప్రతియేటా వినాయక ప్రతిమల శోభాయాత్రను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తారు. దీంతో జిల్లాకేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, మండలాల నుంచి జనం భారీగా తరలిరావడంతో పట్టణ వీధులన్ని రద్దీగా మారాయి. నిమజ్జన శోబాయాత్రను ప్రారంభించే ముందు వేలాది మంది లంబోదరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లను చేశారు. శోభాయాత్రను నిర్వహించే రోడ్డు మార్గాలలో వందలాది మంది పోలీసులతో అడుగడుగునా గట్టి బందోబస్తుతో భద్రతను కల్పించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రజల ఆకలి, దప్పికను తీర్చేందుకు వినాయకులు శోభాయాత్రగా వెళ్లే మార్గాలలో పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వ్యాపార యజమానులు భక్తులకు మజ్జిగా, పులిహోర, నీటి సదుపాయాన్ని కల్పించారు.


శోభాయాత్రలో మహిళలు, యువతులు, చిన్నారుల కోలాహలం


పట్టణంలోని పురవీధుల గుండా నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథులు

● శిశుమందిర్‌లోని గణనాథున్ని నిమజ్జనానికి తరలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, సమితి సభ్యులు


● శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు

సంక్షిప్త సమాచారం

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినం

ఆదిలాబాద్, సెప్టెంబరు 17: ఆదిలాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మిఠాయిలు తినిపించుకున్నారు. ప్రపంచ దేశాల్లో భారత దేశాన్ని ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత మోదీకి దక్కుతుందని, కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత : ఎంపీడీవో

తలమడుగు, సెప్టెంబరు 17: రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, హెచ్‌ఎం వెంకట్‌రావు, ఎంపీఈవో సుధీర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నేరడిగొండ, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎస్‌బీఎం కన్సల్టెంట్ జాదవ్ చంపత్‌రావు అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛత పరిశుభ్రత నిర్వహించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో హెచ్‌ఎం అంబరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్‌బీఎం కన్సల్టెంట్ జీపీ సెక్రటరీ చందు, గ్రామస్థులు పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 17: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మగ శిశువుకి జన్మనిచ్చింది. మంగళవారం మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన సీడాం రేణుకబాయి పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో 108 వాహనంలో పిట్టబొంగురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికమై మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉండటంతో వారిని పిట్టబొంగురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు 108 సిబ్బంది కృష్ణ, ఆత్రం అశోక్‌లు తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి అధికారికంగా నిర్వహించాలి'

బోథ్, సెప్టెంబరు 17: ఈనెల 27న నిర్వహించనున్న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని పద్మశాలి సంఘం సభ్యులు స్థానిక శాసన సభ్యులు అనిల్ జాదవ్‌కు మంగళవారం బోథ్‌కు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసిన పద్మశాలి సంఘం సభ్యులు ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో కార్యక్రమాన్ని జరిపించాలని సంఘం మండల అధ్యక్షుడు భోజన్న కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

● జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌ఆలీ ● ఘనంగా ప్రజాపాలన దినోత్సవం ● పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 17: మారుమూలలలో ఉన్న ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వ పరంగా సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్‌అలీ అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతంతో పాటు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహదారుడు మహ్మద్ షబ్బీర్‌ఆలీ మాట్లాడుతూ మహారాష్ట్ర, తెలంగాణ, కేరళ, ఏపీఓలని కొన్ని ప్రాంతాలు నిజాం పాలనలో ఉండేదన్నారు. సంవత్సర కాలం తర్వాత 17 సెప్టెంబరు1948లో భారత దేశంలో విలీనం అయ్యిందన్నారు. ఆ రోజును పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. రేషన్ కార్డులు లేని రైతులతో పాటు సాంకేతిక లోపం కారణంగా రైతుబంధు రాని రైతుల వివరాలను సేకరిస్తున్నామన్నారు.వారికి త్వరలో రుణమాఫీ అవుతుందన్నారు. అదే విధంగా రేషన్ కార్డులు లేని వారికి ఈనెల చివరి నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, అయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తూ..

సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం విలీనం : కలెక్టర్

ఆదిలాబాద్, సెప్టెంబరు 17: 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయిందని, ఆ రోజును పురస్కరించుకొని ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి హోదాలో జాతీయ జ ఎండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అంతకు ముందు మహనీయుల చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా తెలంగాణ నైజాం పాలనలో ఉండేదన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం అయిందని, ఆ రోజును అధికారికంగా జరుపుకునేలా ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించడం జరిగిందన్నారు. అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో గోపిడి జితేందర్‌రెడ్డి, సుధాకర్, డీపీఆర్‌వో తిరుమల తదితరులున్నారు. అలాగే, తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం జిల్లాలోని పోలీసు కార్యాలయాలలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే, జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేంద్రరావు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది సమక్షంలో, జిల్లా సాయుధ దళంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటిలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్ జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, బి.సురేందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ, కలెక్టర్ రాజర్షిషా, ఎషా గౌస్‌ఆలం


ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న పీవో


క్యాంపు ఆఫీసులో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, నాయకులు

● సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో జాతీయ జెండాను ఆవిష్కరించగా, అందరు కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ కూడా హాజరై మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి వందనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తెలంగాణలోని హైదరాబాద్ ప్రాంతం నిజాం కబంధహస్తాల్లో ఉండేదని అప్పటి ప్రభుత్వం నిజాం సైన్యంతో పోరాడి హైదరాబాద్‌ను దేశంలోని రాజ్యాలలో విలీనం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ప్రతియేడాది సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20 నుంచి ప్రజాపాలన కార్యక్రమం మొదలవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పతకాలు సాంకేతిక లోపాలతో రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్, పరిపాలన అధికారి దామోదర స్వామి, ఈఈ రాథోడ్‌భీమ్‌రావు, ఏసీఎంవో ఆత్రంజగన్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగంపల్లి చంద్రయ్య, ఖయ్యుం, ఇక్బాల్, నిసార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరుకుంటున్న విద్యార్థులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


గ్రామాలకు వెళ్లి విద్యార్థులను తీసుకువస్తున్న టీచర్లు

ఉట్నూర్, సెప్టెంబరు 17: 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో 'అయోమయంలో గిరిజన విద్య' అనే శీర్షికతో వచ్చిన వార్త కథనానికి అధికారులు స్పందించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఇన్‌చార్జీ డీడీ జాదవ్‌వసంతరావుల ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమం పాఠశాలల టీచర్లు విద్యార్థుల ఇంటిబాట పట్టారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం మల్కు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఏజెన్సీలోని సోయినూర్, గుంజాల, పూసిగూడ, జండ, దొంగచింత గ్రామాలకు పాఠశాల ఉపాధ్యాయులు జివేందర్, లాల్‌షావ్, తులసిదాస్‌లు చేరుకొని పొలాల అమావాస్య పండుగకు వెళ్లిన విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరడంతో ఆయా గ్రామాల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించారు. ఆదిలాబాద్, ఉట్నూర్, బోథ్ ఏటీడీశక్షల పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థులు చేరుకుంటున్నారని, ఇప్పటి వరకు 70శాతం చేరుకున్నారని, రేపటిలోగా వందశాతం విద్యార్థులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

ఖానాపూర్ - దిలావర్‌పూర్ తాత్కాలిక రోడ్డుకు

కాంగ్రెస్ నాయకుల మరమ్మతులు

ఖానాపూర్, సెప్టెంబరు 17: రెంకోని వాగుపై ఖానాపూర్ - దిలావర్‌పూర్ మధ్య వేసిన తాత్కాలిక రోడ్డు 20 రోజుల క్రితం భారీ వర్షాలకు కొటుకుపోయింది. దీంతో చుట్టుపక్క గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం స్వచ్ఛందంగా మరమ్మతులు చేయించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ కరిపే రాజ్ కుమార్, రాసమల్ల అశోక్, దాతుర్క లక్ష్మీరాజం, బొడికె సంతోష్, ఓరుగంటి రాజేశ్వర్, పంబాల రాజన్న, వాహిద్ రాజన్నలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా తాత్కాలిక రోడ్డును నిర్మించారు. ఇందుకోసం సుమారు రూ. 40 వేల వరకు ఖర్చు చేసినట్లు నాయకులు తెలిపారు.

సీపీఎస్ విధానంతో ప్రజాధనం వృథా

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 17: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంతో ప్రతి సంవత్సరం వేలకోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న దాదాపు రెండు లక్షల సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి ప్రతి సంవత్సరం మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో వేలకోట్ల రూపాయలను ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు చెల్లించడం జరుగుతుందన్నారు. ఫలితంగా ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా ఉన్న నాయకులు పెన్షన్ తీసుకుంటున్నప్పుడు 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రజలకు, విద్యార్థులకు సేవలు అందించినటువంటి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. రెండు లక్షల కుటుంబాల భవిష్యత్తును ఆందోళనలోకి నెట్టేసిన సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్ సత్వరమే అమలు చేయాలని, గత 16 సంవత్సరాలుగా కస్తూర్బా సిబ్బంది వెట్టి చాకిరి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, కిషోర్, అధ్యాపకులు జైపాల్ రెడ్డి, నర్సయ్య, పాల్గొన్నారు.

ఐటీడీఏ ఉద్యోగి ఇంట్లో చోరీ

ఉట్నూర్, సెప్టెంబరు 17: ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ క్వార్టర్స్‌లలో ఉంటున్న ఐటీడీఏ ఉద్యోగి ఇంట్లో దొంగతనం జరిగింది. గత మూడు రోజుల కింద అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగి జైపాల్ తన భార్యతో కలిసి ఆదిలాబాద్‌లో వైద్యం కోసం వెళ్లగా.. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి వెనుక ప్రహరీ దూకారు. ఇనుప చువ్వలతో తలుపు బద్దలు కొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారంతో పాటు వైద్యం కోసం దాచుకున్న నగదును అపహరించారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై మనోహర్, ఏఎస్సై రామయ్యలు సందర్శించి పంచనామా నిర్వహించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దొంగల ఆచూకీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మనోహర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉట్నూర్, సెప్టెంబరు17: మద్యం మత్తులో తాగుడుకు బానిసైన కూలీ పని చేసి జీవిస్తున్న యువకుడు పెట్రోల్ పోసుకుని నిప్పుతో కాల్చుకున్న వ్యక్తి మంగళవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతు మృతి చెందాడని ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మోమిన్‌పురాలో నివాసం ఉంటున్న పైడిపల్లి మల్లేష్(30)తాగుడుకు బానిస కావడంతో తల్లి శాంతమ్మ మందలించినందున ఈ నెల15న ఒంటి పై పెట్రోల్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడగా స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారని, ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం అందుకుంటు మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తల్లిశాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



రాజయ్యకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మౌలానా ఆజాద్ స్మారక క్లాక్ టవర్ పనులను పూర్తి చేయాలి

నిర్మల్‌అర్బన్, సెప్టెంబరు17: జిల్లాకేంద్రంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌరస్తాలో అర్ధాంతరంగా నిలిచిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక క్లాక్‌టవర్, ముస్లిం మైనార్టీల షాదీఖానా, హజ్‌హౌస్ సముదాయాల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ మంగళవారం కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు వినతిపత్రం అందజేశారు. 22 ఏళ్లుగా స్మారక నిర్మాణం కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పించుకుంటూ వస్తున్నా నిర్మాణ పనుల గురించి మాత్రం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఇటీవల నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సభలో జిల్లా ప్రజల సాక్షిగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య చదివిన అధికారిక సందేశంలో నిర్మల్‌లో రూ.50లక్షలతో మౌలానా అబుల్ కలాం ఆజాద్ క్లాక్ టవర్, ముస్లిం మైనార్టీల షాదీఖానా హజ్‌హౌస్ సముదాయాల నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారని తెలుపుతూ ఆయనకు వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. స్పందించిన రాష్ట్రఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్లరాజయ్య నిర్మాణ పనులను పునఃప్రారంభించి నిర్ణీతకాలంలో ప్రారంభించుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్‌జిల్లా శాఖ వ్యవస్థాపకులు, అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, ఉపాధ్యక్షులు సయ్యద్ చాంద్ పాషా, పట్టణ జనరల్ కార్యదర్శి షేక్ ఇంతియాజ్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ మసూద్ ఖాన్, గౌరవ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ ఖదీర్, మీర్జా పాషా బేగ్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ నేతల నివాళులు

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు17: నిర్మల్ పట్టణ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. తెలంగాణ విద్రోహదినం సందర్భంగా జిల్లా కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ భూస్వామ్య రాచరిక బానిసత్వంపై తిరగబడి, భూమి భుక్తి, వెట్టి చాకిరీ నుంచి విముక్తికి సాగిన వీరోచిత రైతాంగ సాయుధ పోరాటమన్నారు. తెలంగాణ విమోచనం, విలీన దినం కాదని విద్రోహ దినమన్నారు. బక్కన్న, కే. లక్ష్మీ, తశ్రీన్, నర్సయ్య పాల్గొన్నారు.

నిర్మల్ పట్టణం వేయి ఉరులమర్రి వద్ద గల అమరవీరుల స్థూపానికి కాంగ్రెస్‌పార్టీ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ప్రజా పాలనలో భాగంగా జరిగిన కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఎం. శంకర్, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు గంగాధర్, వాసవి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వ్యతిరేకులకు ప్రజలే బుద్ధి చెబుతారు

● సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం సరికాదంటూ ఖానాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



ఖానాపూర్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్, సెప్టెంబరు17: తెలంగాణ వ్యతిరేకులకు రాబోయే కాలంలో ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి కేటీఆర్ పిలుపుతో మంగళవారం ఖానాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజగంగన్న మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లిని అవమానపరిచేలా వ్యవహరించడం తగదన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్నోస్థలాలు ఉండగా తెలంగాణ తల్లి విగ్రహంఏర్పాటు చేయాల్సిన సచివాలయం ఎదుటనే రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుచేసి వివాదానికి కారకులయ్యారన్నారు. తెలంగాణ ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలోనే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. అనంతరం తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకుముందు తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కల్వకుంట్ల నారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గుగ్లావత్ వాల్‌సింగ్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, 8వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, రైతుబంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, మాజీ సర్పంచ్ గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శనిగారపు శ్రావణ్, జిల్లా నాయకులు కారింగుల సుమన్, దివాకర్, గాజుల అజయ్, మహిపాల్, ఫాహిమ్, తదితరులున్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

● రక్తదానం చేసిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, సెప్టెంబరు17: జిల్లాకేంద్రంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ 74వ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రక్తదానం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దేశప్రజల జీవితాలను సంతోషంగా ఉంచేందుకు అవిశ్రాంతంగా కృషిచేస్తున్న ప్రధాని మోదీమరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నిర్మల్‌కల్చరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జిల్లా కేంద్ర ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

భైంసా: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రధానిగా నరేంద్రమోదీ చేపట్టిన సంస్కరణల మూలంగా ప్రపంచంలోనే భారత దేశం అగ్రభాగంలో దూసుకపోతోందన్నారు. గత దశాబ్ద కాలంగా ప్రధాని మోదీ సాధించిన విజయాలు, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను వివరించారు. బీజేపీ పార్టీ శ్రేణులు ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన సంస్కరణలు, సాధించి విజయాలపై ప్రధాన రోడ్డు మార్గాల్లో ప్రదర్శనలు నిర్వహించారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించేందుకు పాలకుల కుట్ర

● సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్

ఖానాపూర్, సెప్టెం బరు17: భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం తెలంగా ణ రైతాంగం సాగించి నసాయుధ పోరాటాన్ని ప్రస్తుత పాలకులు వక్రీకరించే కుట్రచేస్తు న్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూత న్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిజాం రాజాకార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఎర్రజెండాలు చేతబట్టి నాడు ప్రజలు పోరాడారన్నారు. తెంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభు త్వం అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శులు బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, గంగామణి, మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, తదితరులున్నారు.

'సెప్టెంబరు 17 ముమ్మాటికీ విద్రోహ దినమే'

ఖానాపూర్: సెప్టెంబరు 17 ముమ్మాటికి విద్రోహ దినమేనని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. మంగళవారం ఖానాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను మరచిన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అమరుల త్యాగాలను, పోరాటాలను పక్కదోవ పట్టిస్తూ విలీనమని, విమో చనమని వక్రీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం లింగన్న, ఆకుల సత్తన్న, తదితరులున్నారు.

పాఠశాల ఆవరణలో పశువులు రాకుండా ఇనుప కంచె ఏర్పాటు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 17: మండలంలోని మునిపెల్లిలో గల ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఎంపీడీవో రాధా రాథోడ్ తక్షణమే స్పందించారు. పాఠశాల ఆవరణలోకి పశువుల రాకుండా ఇనుప జాలికంచెను మంగళవారం ఏర్పాటు చేయించారు. పాఠశాల ప్రహరీ పాక్షికంగా కూలిపోవటంతో పశువులు పశువులు పాఠశాల ఆవరణలోకి వచ్చి దుర్గంధం చేస్తున్నాయి. దీంతో అలాగే చిన్నారులు, విద్యార్థులకు ప్రమాదకరంగా పరిణమించింది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఆమెకు తెలపగా తక్షణమే స్పందించి తాత్కాలికంగా ఈ కంచెను ఏర్పాటు చేశారు.



విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న స్వర్ణకార సంఘ మహిళలు

ఘనంగా విశ్వకర్మ జయంతి

భైంసా, సెప్టెంబరు 17: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో మంగళవారం మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఉదయం వేళలో ప్రారంభమైన జయంతి వేడుకలు సాయంత్రం వరకు కోలహలంగా సాగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటాన్ని శోభయమానంగా అలంకరించారు. చిత్రపటం ముందు యజ్ఞం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. జయంతి వేడుకల్లో పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ మాట్లాడుతూ సృష్టిలోనున్న సకల కళలకు ఆరాధ్యదైవం మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ పేర్కొన్నారు. స్వర్ణకార సంఘ భవన అధునీకరణకు, అదనపు నిర్మాణాలకు అవసరమైన నిధుల మంజూరికి అంకితభావంతో పాటుపడుతానని వెల్లడించారు. ఇందులో భైంసా పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బెజ్జంకి రవీంద్రచారి,కోశాధికారి వంగల రాజు, ఉపాధ్యాక్షులు విద్యాసాగర్, గౌరవ అధ్యక్షులు బొజ్జ పండరి, రాష్ట్ర నాయకులు పాలకొండ శ్రీనివాస్, జిల్లా ప్రతినిధులు కలికోట రాములు, బేంద్రీ మోహన్, బొజ్జ రవీందర్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..



తెలంగాణ చౌక్‌లో విశ్వకర్మ జయంతి నిర్వహిస్తున్న స్వర్ణకార సంఘం నాయకులు

ఖానాపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలువేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కడార్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బిక్కనూరు ప్రవీణ్, కోశాధికారి ఎనగంటి అజయ్, బులియన్ అ ధ్యక్షుడు శ్రీపాద వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి దురిశెట్టి భీమేశ్వర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కడార్ల గంగనర్సయ్య, జగన్, తదితరులున్నారు.

విశ్వకరమ్మ కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నిర్మల్‌కల్చరల్: భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం సోఫీనగర్ కాలనీలో నిర్వహించిన విశ్వకరమ్మ కళ్యాణానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్: మండలకేంద్రంలోని శ్రీవిశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. విశ్వకరమ్మ పూజలో భాగంగా తమ పనిముట్లను ఆరాధిస్తామని తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో సత్తన్న, ప్రకాష్, గంగాధర్, నర్సయ్య, లచ్చన్న, లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



దస్తురాబాద్‌లో విశ్వకర్మ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

బోథ్ ఆసుపత్రిలో సిబ్బంది మెరుపు సమ్మె

బోథ్, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు రోజుల క్రితం విధుల్లో ఉన్న డాక్టర్ సిబ్బందిపై దాడి జరిగింది. దాడిలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వైద్య సిబ్బంది మెరుపు సమ్మెకు దిగారు. ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ల సేవలను నిరాకరించి అత్యవసర సేవలకు మాత్రమే సిబ్బంది సహకరించారు. సిబ్బంది తమకు రాత్రిపూట పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. దీంతో విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్, తహసీల్దార్ సుభాష్ చంద్రలు ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సమ్మెలో ఉన్న సిబ్బందితో చర్చించారు. అయితే వైద్య సిబ్బంది తరపున ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్ తహసీల్దార్, ఎస్సైలతో చర్చించారు. ఆసుపత్రిలో సిబ్బందిపై దాడులు జరగడం కొత్తేమి కాదని, గతంలో సైతం దాడులు జరిగాయని సిబ్బంది ఓపికగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అయితే రెండు రోజుల క్రితం కొంత మంది వ్యక్తులు మద్యం తాగి ఆసుపత్రిలో సిబ్బందిపైన దాడికి ప్రయత్నించి దురుసుగా ప్రవర్తించారన్నారు. అయితే సిబ్బంది మనోధైర్యం కోల్పోయి రాత్రిపూట విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ కరువైందని పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని సిబ్బంది డిమాండ్ చేశారు. అప్పటి వరకు విధులకు వెళ్లేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో తహసీల్దార్, ఎస్సైలు జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్తామని విధులు నిర్వహించాలని సిబ్బందిని సముదాయించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ఉట్నూర్, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి ఉత్సవాలను స్వర్ణకార విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ హాజరై వీరబ్రహ్మేంద్ర స్వామితో పాటు విశ్వకర్మ భగవానునికి పూజలు చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార, విశ్వకర్మ సంఘం సభ్యులు కట్టప్రభాకర్, కట్టా లక్ష్మణచారి, రంగుసత్యనారాయణ, వెంకటాచారి, విజయ్‌కుమార్, చింతల భీమయ్య, చింతల రమణ, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు రంగు రాజు మాట్లాడారు. ఇందులో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేడి చర్ల ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రూపేష్, సంయుక్త కార్యదర్శి పాపేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రఘుపతి, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల పలువురి ఆత్మహత్య

జైనథ్ రూరల్, సెప్టెంబరు 17: మండలంలోని మేడిగూడ(ఆర్) గ్రామానికి చెందిన బుర్రివెంకన్న(59) సోమవారం రాత్రి జీవితం పై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అలాగే, జైనథ్ మండలంలోని సిర్సన్న(జె) గ్రామానికి చెందిన తుకరెడ్డి ప్రవీణ్(26)మద్యానికి బానిసై సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

● భార్య కాపురానికి రావడం లేదని..

తలమడుగు: మండల కేంద్రంలోనరి రైల్వే స్టేషన్ సమీపంలో భార్య కాపురానికి రావడం లేదని రైలు కింద పడి ఒకరు మృతి చెందినట్లు రైల్వే అధికారి ఎస్‌హెచ్‌వో భోజన్న తెలిపారు. వివరాల ప్రకారం తలమడుగులో నివాసముంటున్న సంజయ్ దత్త వాగ్మారే(28) మంగళవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సంజయ్ దత్త మహారాష్ట్రలోని యావత్ మాల్ జిల్లా ఉమార్ఖెడ్ మండలం బోరివన్ గ్రామానికి చెందిన వాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

'ఐక్యతతో హక్కులు సాధించాలి'

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 17: ఆదివాసీలంతా ఐక్యంతో పోరాడి హక్కులు సాధించుకోవాలని ఆదివాసీ సంఘాలు పెద్దలు అన్నారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా దర్బార్ హాల్‌లో ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ రాయిసెంటర్ సార్మేడీలు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. జైనూర్ సంఘటనలో హత్యాయత్నానికి గురైన ఆదివాసీ మహిళకు రక్షణ కల్పించాలని, ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడికి ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతం 5వ, 6వ షెడ్యూల్‌లో ప్రత్యేక అధికారులు కలిగిన గవర్నర్ ఉమ్మడి ఆదిలాబాద్‌లో 30న పర్యటించాలని, ఈనెల 21న తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈనెల 23న ఐటీడీఏల వద్ద శాంతియుత ధర్నా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 26న జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, జిల్లా సార్మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ సమన్వయ కర్త సిడాం భీంరావు, కేస్లాపూర్ సార్మేడి మెస్రం వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నాటి నాయకుల కృషే నేటి ప్రజా పాలన

● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది

ఆదిలాబాద్, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబరు 17న భారతదేశంలో ఐక్యమైందని అన్నారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లాబాయ్ పటేల్ నాయకులు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. నాటి స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగా నేడు తెలంగాణలో స్వేచ్ఛా స్వాతంత్ర్య ఫలాలు పొందుతున్నామన్నారు. అందుకే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోందన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలో మంగళవారం ఘనంగా ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసే ప్రజా పాలన దినోత్సవం జరుపుకున్నారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, రాథోడ్ దుర్గం, హెచ్ఎం వెంకట్‌రావు, సీఈవో శ్రీనివాస్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం స్వామి, తదితరులున్నారు.

భీంపూర్ రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా పాలన దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గోలప కృష్ణారెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహ్మద్ ఖలీం, పీహెచ్‌సీ డాక్టర్ నిఖిల్ రాజ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మావల: ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి రాజలింగు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇందులో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ఏవో వివేక్, ఏఈవో కంది గంగారెడ్డి, పంచాయితీ కార్యదర్శి దుర్గయ్య, నరేందర్‌రెడ్డి, ధర్మేందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: ప్రజా పాలన దినోత్సవాన్ని మంగళవారం అధికారులు ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఇందులో తహసీల్దార్ కవితరెడ్డి, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్ హై, పీఏసీఎస్ ఛైర్మన్ ముండే సంజీవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో విజేతలను అభినందించిన ఎమ్మెల్యే

ఉట్నూర్, సెప్టెంబరు 17: ఈనెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్ మౌలాలిలో జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ ఖోఖో పోటీలలో విజేతలు కోనలిచిన గిరిజన సంక్షేమ ఉట్నూర్ ఆదర్శ పాఠశాల క్రీడాకారులను ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాలు మంగళవారం అభినందించారు. ఉట్నూర్ ఐటీడీఏ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఖోఖో విజేతలు సిడాం శంకర్, కుముర సురేందర్, టి.అక్షయ్, రాథోడ్ శివసాయి, ఆత్రం యుదవ్వాన్, శివచరణ్, హనుమంతరావు, కోచ్ శివకృష్ణలు వారిని కలుసుకున్నారు.

'రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటు సరికాదు'

ఆదిలాబాద్, సెప్టెంబరు 17: తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం సరికాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జై తెలంగాణ.. జై జై తెలంగాణ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడారు. ఇందులో పార్టీ నాయకులు అజయ్, రమేష్, యూనీస్‌అక్బాని, స్వరూప, నారాయణ, పరమేశ్వర్, తిరుపతి, తదితరులున్నారు.

ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద మద్యం పట్టివేత


బోథ్, సెప్టెంబరు 17: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఘన్‌పూర్ చెక్ పోస్టు వద్ద సోమవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి ఆటో (టీఎస్18టీవో 297) నెంబరు గల వాహనంలో అక్రమంగా మహారాష్ట్ర నుంచి తీసుకొస్తున్న 104 (90ఎంఎల్) దేశీదారు మద్యం సీసాలను పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలించి ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసుకోవడం జరిగిందని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 ၊ కనిష్ఠం 23.6



నిర్మల్
జిల్లా వార్తలు

బుధవారం 18 సెప్టెంబరు 2024



• శోభాయాత్రలో బుధవార్‌పేట్ గణపతి



• గణేష్ విగ్రహం వద్ద పూజలో ఎమ్మెల్యే, ఎస్పీ



• బందోబస్తు మధ్య సాగుతున్న నిమజ్జనం



• ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

నయనానందకరం.. గణేషుని నిమజ్జనోత్సవం

- వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించిన బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి
- ఏర్పాట్లపై కలెక్టర్ దిశానిర్దేశం
- జిల్లావ్యాప్తంగా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు
- పాల్గొన్న ఎస్పీ జానకీ షర్మిల
- విధి నిర్వహణలో 700ల పోలీసు సిబ్బంది
- తరలివచ్చిన భక్తజనం
- కాషాయ జెండాలతో నిండిపోయిన జిల్లా కేంద్రం
- సీసీ కెమెరాలతో గట్టి నిఘా

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 17: గత పది రోజుల పాటు భక్తుల పూజ లందుకున్న గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో వైభవంగా జనసందోహం మధ్య కోలాహలంగా ప్రారంభమైంది. బుధవార్‌పేట్‌లోని ఒకటి, రెండవ నెంబర్ వినాయక విగ్రహాల వద్ద స్థానిక ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గణేష్ ఉత్సవసమితి అధ్యక్షుడు ముప్పిడి రవి, సభ్యులు నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శోభాయాత్రలో నృత్యాలు చేసి ఉత్సాహపరిచారు.

నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలి : ఏలేటి

నిర్మల్ జిల్లా ప్రజలు వినాయక నిమజ్జన శోభాయాత్ర శాంతియుతంగా జరుపుకోవాలని మత సామరస్యం కాపాడాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. నిమజ్జన కార్యక్రమం సక్రమంగా జరిగే విధంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఉత్సవ కమిటీలు పోలీసు అధికారులకు సహకరించి త్వరగా నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లకు కలెక్టర్ ఆదేశం

జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించే వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఉదయం నిమజ్జనం జరిగే వినాయక సాగర్, బంగల్‌పేట్ ప్రాంతాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. చెరువు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని వాహనాలు నియంత్రించాలని సూచనలుచేశారు. విద్యుత్ ప్రమాదా లు జరుగకుండా చూడాలని ఆ శాఖను ఆదేశించారు. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని వైద్యాధికారిని ఆదేశించారు. అగ్నిమాపక, పోలీసు, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా ఆదేశాలిచ్చారు.

తరలివచ్చిన భక్తజనం..

వినాయక నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు సమీప గ్రామాల నుండి భక్తజనం తరలిరావడంతో నిర్మల్ జనసంద్రంగా మారింది. అడుగడుగునా కాషాయ జెండాలు రెపరెపలాడి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఉత్సాహం నింపిన నృత్యాలు

గణేష్ నిమజ్జన శోభాయాత్ర ముందు చేసిన యువకుల నృత్యాలు విశేషంగా అలరించాయి. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, తదితరులు చేసిన నృత్యాలు యువతకు ఉత్సాహాన్నిచ్చాయి.

ఎస్పీ నేతృత్వంలో గట్టి పోలీసు భద్రత

నిర్మల్ జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన శోభాయాత్రకు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల నేతృత్వంలో అధికార యంత్రాంగం గట్టి పోలీసు భద్రత చర్యలు చేపట్టింది. జిల్లా నలుమూలలా అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించింది.

విధి నిర్వహణలో 700 పోలీసులు

నిమజ్జన శోభాయాత్ర బందోబస్తులో మొత్తం 700ల మందికి పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాకు చెందిన 300ల మందితో పాటు ఇతర ప్రాంతాల నుండి 400ల మందిని నియమించారు. ప్రార్థన స్థలాల వద్ద ప్రత్యేక బృందాలు నియమించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు.

పోలీసు కంట్రోల్ రూమ్‌కు సీసీ టీవీల అనుసంధానం

నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షించేం దుకు గాను 40 సీసీ టీవీలను, 10 సోలార్ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. మొబైల్ పోలీసింగ్, బ్లూ కోట్ తదితర వ్యవస్థలు ఏర్పాటు చేసి డేగ కళ్లతో నిమజ్జన శోభాయాత్రను పర్యవేక్షించారు.

సంక్షిప్త సమాచారం

డ్రోన్, వీడియో కెమెరాలతో నిమజ్జన ప్రక్రియ పర్యవేక్షణ

• ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు17: నిర్మల్‌లో మంగళవారం నిర్వహిస్తున్న వినాయక నిమజ్జనాన్ని వీక్షించేందుకు డ్రోన్, వీడియో కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. 700 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారని వివరించారు. నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంట్రోల్ రూమ్‌కు 42సీసీటీవీలు, 10సోలార్ కెమెరాలు అనుసంధానం చేశామన్నారు. డీఎస్పీ గంగారెడ్డి ఎస్పీతోపాటు పాల్గొని పలుప్రాంతాలు సందర్శించారు. బుధవార్‌పేట్ వినాయకుడికి హారతి ఇచ్చి పూజలు చేశారు.

వానల్‌పాడ్‌లో 'స్వచ్ఛత హీ సేవ'

భైంసారూరల్, సెప్టెంబరు17: మండలంలోని వానల్‌పాడ్‌లో ఎంపీవో మోజాం హుస్సేన్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ దివస్ ఘనంగా నిర్వహించారు. స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత పేరుతో రోజువారీ కార్యక్రమాలు గ్రామాల్లోని ప్రతిఒక్కరూ భాగస్వామ్యంతో చేపట్టాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో కలిసి ర్యాలీ తీసి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఉపాధ్యాయులు గణపతి, వసంత, శ్యామల, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

ఘనంగా గోపాలకృష్ణయ్య జయంతి

కుంటాల, సెప్టెంబరు17: మండల కేంద్రంలోని స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్రోద్యమం దేశ చరిత్రలో గొప్ప ఘట్టమని, అలాంటి పోరాటంలో ఎందరో మహానుభావులు భారతమాత సంకెళ్ల తెంచేందుకు తమ ప్రాణాలను త్యాగం చేశారని అలాంటివారిలో ఒకరు గోపాలకృష్ణయ్య అని ప్రిన్సిపాల్ సంతోష్ అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం మొదలుకొని మహాత్మాగాంధీ పిలుపునిచ్చిన అన్ని ఉద్యమాలలో ఆయన కీలకంగా వ్యవహరించారని డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

కుంటాల, సెప్టెంబరు17: అఖిల పక్షం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కల్లూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి తెలంగాణతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెంట దశరథ్, బీజేపీ మండల అధ్యక్షులు గుడ్డేటి నర్సయ్య, నాయకులు లక్ష్మణ్ పటేల్, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు విరేకర్ దత్తు, రజనీకాంత్, తదితరులు ఉన్నారు.

'పీఎం ఆవాస్ యోజనకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 17 : పీఎం ఆవాస్ యోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కోరారు. మంగళవారం ఒడిశా రాష్ట్రంలో ఈ పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ఇళ్లు లేని వారికి 10 లక్షల కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. సమావేశ అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడు తూ.. కేంద్ర, రాష్ట్ర పథకాలు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేయాలన్నారు. మెప్మా పీడీ సుభాలీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

• త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య • జిల్లావ్యాప్తంగా వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

నిర్మల్‌అర్బన్, సెప్టెంబరు17: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా యంత్రాంగం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్యఅతిథిగా రాష్ట్రఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన చైర్మన్ రాజయ్య, పుర ప్రముఖులకు అధికార అనధికారులకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నాటి రాచరిక పాలన నుంచి తెలంగాణ ప్రాంతం విముక్తి కోసం జరిగిన పోరాటాలను గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పలు ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరిస్తూ, అభయహస్తం ఆరుగ్యారంటీల ద్వారా జిల్లాప్రజలకు చేకూరినలబ్ధి వివరాలను వివరించారు. జిల్లాఅభివృద్ధి కోసం అధికారులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల విద్యార్థులచే తెలంగాణసాంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ముఖ్య అతిథి, కలెక్టర్ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంతకు ముందు కలెక్టర్ అభిలాష అభినవ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతోకలిసి చైర్మన్ రాజయ్య అమర వీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలశక్తి కార్యక్రమ పోస్టర్లను కలెక్టర్, ఎస్పీలతో కలిసి చైర్మన్ రాజయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కళాకారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

నిర్మల్‌కల్చరల్: జిల్లాకేంద్రంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి జాతీయ పతాకం ఆవిష్కరించారు. జడ్పీసీఈవో గోవింద్, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎస్పీ కార్యాలయంలో పతాకావిష్కరణ

జిల్లాఎస్పీ జానకీ షర్మిల జిల్లా కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జాతీయజెండా ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అధికారులకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్రగీతాన్ని ఆలపించారు. చైర్మన్ ఈశ్వర్, నాయకులు, కౌన్సిలర్లు ఉన్నారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం

రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో స్వాగతం పలికారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. చైర్మన్ ఈశ్వర్, నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండలంలోని గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ స్వాతి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుణ కుమారి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజేశ్వర్ గౌడ్, ప్రాథమిక సహకార సంఘంలో చైర్మన్ పీవీ రమణారెడ్డి, స్త్రీ శక్తి భవన్‌లో ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, ఎన్ఆర్ ఈజీఎస్ కార్యాలయంలో ఏపీవో దివ్య రెడ్డి, ఆయా గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు త్రివర్ణ పతాకం ఎగురవేశారు.

కుంటాలలో..

కుంటాల: మండలంలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నిప్రభుత్వ కార్యాలయాల్లో జెండాలను ఎగురవేశారు. అనంతరం స్వచ్ఛతహీ సేవా ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీలలో పంచాయతీ సెక్రటరీలు, మండల కార్యాలయాల్లో మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముథోల్‌లో..

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాలలో, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శివ కుమార్, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ వెంకటేష్ గౌడ్, విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో మైసాజీ, ముథోల్ పంచాయతీ కార్యాలయంలో ఈవో ప్రసాద్‌గౌడ్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సరోజిని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే ముథోల్‌లో ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

భైంసా, సెప్టెంబరు17: పట్టణంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్స వ వేడుకలు నిర్వహించారు. ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ జాతీయ జెండాను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ మాట్లాడుతూ ఎందరో మంది ప్రాణ త్యాగాలు, వీరోచిత పోరాటాల మూలంగా నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, భైంసా మాజీ ఎంపీపీ అబ్దుల్‌రజాక్ బీజేపీ నాయకులున్నారు.

సారంగపూర్‌లో..

సారంగాపూర్: మండల కేంద్రంలో అధికారులు మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీ కాంతారావులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఒకరికొకరు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: ప్రజాపాలన దినోత్సవాన్ని మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. 'స్వచ్ఛ హీసేవా' కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంపీవో అజీజ్ ఖాన్, ఏపీఎం వాణి శ్రీ, ఏపీవో ప్రమీల, తదితరులు ఉన్నారు.



అమరుల స్థూపానికి నివాళ్లర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య



విద్యార్థులకు మీదుగా బహుమతులు అందజేస్తున్న దృశ్యం



బాలశక్తి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, చైర్మన్ రాజయ్య



జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు



దిలావర్‌పూర్ రెవెన్యూ కార్యాలయంలో..



సారంగాపూర్‌లో..



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్